

# యండమూరి కథాస్రవంతి

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## నీలోంచి నాలోకి..

## (ఏప్రిల్ 10, 2000 ఆంధ్రప్రభ వారపత్రిక నుంచి)




"... సరసమంటే ఏమిటి?" అడిగాడు నా భర్త.

బిత్తరపోయాను. ఏ భర్తా మొట్ట మొదటి రాత్రి తన భార్యతో జరిపే తొలి సంభాషణలో, తొలి ప్రశ్నగా దాన్ని అడగడు. స్వచ్ఛమైన ఉర్దూలో అతడు అడిగిన ప్రశ్నకి ఏ సమాధానం చెప్పాలో తెలియక మౌనం వహించాను.

నా అయోమయాన్ని అర్థం చేసుకున్నట్టు అతడు సన్నగా నవ్వి "...నువ్వు గదిలోకి రావటం ఆలస్యం అయ్యేసరికి ఒక కవిత వ్రాద్దామని కూర్చున్నాను. 'సరసము' అన్న పదానికి సరి అయిన అర్థం తెలియలేదు. రాగానే ఇలా అడిగినందుకు కంగారు పడ్డావా?" అన్నాడు.

నేను కూడా తేరుకొని, "అదేం లేదు!" అని ఉత్సుకతతో కూడిన ఆశ్చర్యంతో "మీరు కవితలు వ్రాస్తారా?" అని అడిగాను.

"అవును. నీ కవిత చదివే నీ కోసం భారతదేశంలో వాకబు చేశాను" అన్నాడు.

సనాతన ముస్లిమ్‌ల కుటుంబం మాది. గోదావరికి పశ్చిమాన కొవ్వూరికి వంద కిలోమీటర్ల దూరంలో ఒక పల్లెటూరు. మా కుటుంబాల్లో స్త్రీ అభిప్రాయాలకి అంత విలువ ఇవ్వరు. అందులోనూ అంత ఉన్నత పదవిలో ఉన్న సైనికాధికారి ఏరి కోరి వచ్చి చేసుకుంటానంటే మా తల్లిదండ్రులు ఎగిరి గంతేసి ఒప్పుకున్నారు. ఆ విధంగా నా అంగీకార, అనంగీకార ప్రసక్తులు లేకుండానే ఆసిఫ్ అహ్మద్‌కి అర్ధాంగినయ్యాను.

మాలాంటి కొన్ని ముస్లిమ్స్ తెగల్లో జుల్వా అవగానే, పెళ్ళికూతురు భర్త ఇంటికి వచ్చేస్తుంది. హిందువుల్లోలా కాకుండా, సుహాగ్ రాత్ (శోభనం) పెళ్ళికొడుకు ఇంట్లో జరుగుతుంది. ఆ విధంగా నేను పెళ్ళవగానే పశ్చిమ గోదావరి జిల్లా నుంచి పాకిస్తాన్ వచ్చేశాను.

అన్నట్టు చెప్పటం మర్చిపోయాను. మా ఆయన పనిచేస్తున్నది పాకిస్తాన్ సైన్యంలో...!

...

పెహలీరాత్ గదిలోకి పంపబోయేముందు చేసే తతంగాన్ని 'కరీమా' అంటారు. అంతటి ఆజానుబాహువూ, మామూలుగా అతి గంభీరంగా ఉండేవాడూ అయిన నా భర్త – చిన్నపిల్లాడిలా పూలబంతుల్తో ఆడటం చూసి నవ్వుకున్నాను. తొలిరాత్రి మల్లెపూలు ఎక్కువగా వాడతారని

పుస్తకాల్లో చదివాను. కానీ, మాలో గులాబీ రేకుల్నీ, అత్తరునీ ఎక్కువ ఉపయోగిస్తారు. ఆ పరిమళం మల్లెలాగా మత్తెక్కించదు. ఆహ్లాదకరంగా ఉంటుంది. కామానికీ, శృంగారానికీ ఉన్న తేడాలా అనిపిస్తుంది.

ఆ పక్కమీద పరచుకుని ఉన్న గులాబీరేకుల్ని పక్కకి తొలగిస్తూ ఒక పుస్తకంలో కవిత తీసి నాకు చూపించి, "ఇది నువ్వు వ్రాసిందేగా?" అన్నాడు. అది నేను వ్రాసిందే. 'జిహేద్ ' అన్న ఉర్దూ పత్రికలో పడింది. అది అహ్మదాబాద్ నుంచి వెలువడుతుంది. జిహేద్ అంటే పోరాటం అని అర్థం. పేరుకు పోరాటమే కానీ, అన్ని రకాల కథలూ, కవితలూ వేస్తారు. నేను వ్రాసిన కవితని వాళ్ళు వేసుకోవటం, పైగా పదిరూపాయల పారితోషికం పంపటం, నాకు అపూర్వమైన అనుభవం.

"ఇండియా నుంచి వస్తూ నా స్నేహితుడు ఈ మ్యాగజైన్ తెచ్చాడు. లాహోర్‌లో ఇచ్చాడు. నీ ఫోటో చూసి మనసు పారేసుకున్నాను. కవిత చదివి మనసు పోగొట్టుకున్నాను."

"నా కవితని పొగుడుతున్నారా, తిడుతున్నారా?" చిరుకోపంతో ప్రశ్నించాను.

అతడు తెల్లబోయి "...అంత బాగోక పోతే పరాయిదేశంలో ఉన్న పిల్లని వెతికి వెతికి ఎందుకు పట్టుకుంటాను?" అన్నాడు. నిజమే కదా అనిపించింది. ఈలోపులో అతను అన్నాడు – "నాకూ ఈ కవితల పిచ్చి ఉంది. ఇద్దరి అభిరుచులూ కలుస్తాయనిపించింది. నీ పేరు చూశాను. నూర్జహాన్ అని కనిపించింది. నా మిత్రునితో ఎంక్వయిరీ చేయించాను."

తరువాత విషయం నాకు తెలిసిందే. మా తల్లిదండ్రులు ఉప్పొంగిపోయారు. పాకిస్తాన్ అంటే ఎంత లేదన్నా మా వాళ్ళకి ప్రేమే! మా తాతగారు (తల్లి తండ్రి) కరాచీ నుంచి ఆంధ్రదేశానికి వలస వచ్చారు. మా తల్లీ, పాకిస్తాన్ మాజీ ప్రధాని జుల్ఫికర్ ఆలీ భుట్టో ఒకే రోజున(1928 లో) పుట్టారు. యాభై ఒక్క ఏళ్ళ భుట్టోని పాకిస్తాన్ సైన్యం ఉరి తీసినప్పుడు, నా తల్లి దుఃఖించటం నాకు ఇప్పటికీ గుర్తుంది.

ఆసిఫ్ అహ్మద్‌తో నా వివాహానికి ఇరు ప్రభుత్వాల తరఫు నుంచీ ఏవైనా అభ్యంతరాలు వస్తాయేమోనని మేము భయపడ్డాము. ఆసిఫ్ సైన్యంలో ఉన్నత స్థానంలో ఉన్నాడు కాబట్టి, ముఖ్యంగా పాకిస్తాన్ నుంచి అభ్యంతరం ఉంటుందేమో అనుకున్నారు. అయితే అలాంటిదేమీ జరగలేదు. వీసా సులభంగానే లభించింది.

"దేవిగారు ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్న ప్రశ్నకి ఊహల్నించి బయటపడి నవ్వాను. "నేను ఏదో కవిత వ్రాయడమేమిటి? దాన్ని పత్రికకి పంపటం ఏమిటి? మీరు చదివి, పెళ్ళికి రాయబారం పంపటం ఏమిటి? గోదారి ఒడ్డు నుంచి, ఇండస్ తీరానికి నేను రావటం ఏమిటి?" అన్నాను.

తన దేశపు నది గురించి ప్రస్తావించేసరికి అతడు గమ్మత్తుగా కళ్ళు ఎగరేసి, "ఓ! నువ్వు హిస్టరీలో గ్రాడ్యుయేట్‌వి కదూ!" అన్నాడు. అతడు నా చేతిని తన చేతిలోకి తీసుకుంటూ ఉండగా ఫోన్ మోగింది. అతడు నుదురు చిట్లిస్తూ దాన్ని అందుకొని అవతలివారు ఏదో చెప్తుంటే "సరే...సరే...!" అని కొంచెంసేపు మాట్లాడి ఫోన్ పెట్టేశాడు.

"ఎక్కణ్ణుంచి ఫోన్?" అని అడిగాను.

"జనరల్ తాలూకు ఆఫీసు నుంచి!" అన్నాడు. "...మీ ప్రధాని బస్సులో లాహోర్ వస్తున్నారట. సెక్యూరిటీ చీఫ్‌గా నన్ను నియమించారు!" అన్నాడు.

మెరుస్తున్న కళ్ళతో "కంగ్రాట్స్!" అన్నాను.

"వాజ్‌పేయి మాకు నచ్చిన ప్రధాని"

అతనిలో అంత ఉత్సాహం కనబడలేదు. "సరే. ఇక దాని గురించి మర్చిపోదాం!" అంటూ ముందుకు వంగి పెదవులపై ముద్దు పెట్టుకున్నాడు.

అంత అకస్మాత్తుగా అతడు అలా ముద్దాడేసరికి కాస్త కంగారుపడ్డాను. అతడి లోంచి నాలోకి ఏదో శక్తి ప్రవహిస్తున్న అనుభూతి కలిగింది. తన అవయవాలన్నిటి తరఫునా తన 'నాలుక'ని రాయబారిగా నియమించి, నా తనువు దుర్గంలోకి పంపినట్టున్నాడు. ఆ రాయబారే నా శరీరపు అవయవాల గురించి గూఢచారి బాధ్యతలు కూడా స్వీకరించినట్టు అనిపించింది. ఆ జలదరింపుల పరిమళపు అలదరింపు వాళ్ళంతా పాకుతూ ఉండగా, అతడు నన్ను ఒకవైపు ముద్దిడుతూనే తన ఆలోచనల్లో ఎక్కడో జారుకున్నట్టు గమనించాను. కాస్త దూరంగా విడిపడి, "ఏం ఆలోచిస్తున్నారు?" అన్నాను.

అతడు నవ్వి, "మా గురించే!" అన్నాడు.

"అంటే?"

"శత్రువుకి సెక్యూరిటీ ఇవ్వాల్సి వస్తోంది చూశావా?"

"శత్రువైనా అతడు మన అతిథి కదా!" అన్నాను. 'మన ' అనటం నాకు గమ్మత్తుగా అనిపించింది.

అతడు మాట్లాడలేదు. మూడ్ మార్చటానికి ఉర్దూలో చిన్న షాయిరీలా, "ఆ అతిథి గురించే తప్ప, పక్కనున్న అభాగతి గురించి ఆలోచించరా?" అన్నాను.

అతడికి అర్థమయింది. ఆవేశంతో చప్పున దగ్గరకు లాక్కున్నాడు.

అది నాకు తొలి పురుష స్పర్శ. బస్ స్టాపుల్లో తగిలే వాళ్ళ గురించి కాదు నేను చెప్పేది. తనువూ, మనసూ సంపూర్ణాంగీకారంతో ఆహ్వానిస్తున్న స్థితిలో స్పర్శ అది!

అందరూ ఇటువంటి సందర్భాల్లో స్త్రీ శరీరాన్ని వీణతోనూ, పురుషుడిని ఆ వీణ తీగె శృతి చేసేవాడితోనూ పోలుస్తారు. నాకు అలా అనిపించలేదు. దాపరికం లేకుండా చెపుతాను. నాకెందుకో దూదేకులవాడు గుర్తొచ్చాడు. ఎక్కడో తీగెని కదుపుతాడు. ఠాంగ్మన్న శబ్దంతో – పింజెలుపింజెలుగా దూది గదంతా వ్యాపిస్తుంది. అతడి చెయ్యి నా వెన్నెముక చివరికి చేరుకునేసరికి నాకు తోచిన పోలిక అది!

నా మెడ వంపు నుంచి మరో వంపులోకి అతడి మొహం జారేసరికి శరీరం అలలా ఎగసిపడి, నా కటి – కెరటమయింది. నాలో అంత కోరిక నిక్షిప్తమయిందని అప్పటి వరకూ నాకు తెలియదు.

అతడు వయసులో చిన్న పిల్లాడై, ముప్పై సంవత్సరాల వెనక్కి వెళ్ళాడు. 'ఆకలే' తేడా!

పురుషుడి కూడా ఒక ప్రత్యేకమైన పరిమళం (ఛా... ఇటువంటి టైంలో అంత సంస్కారవంతమైన పదం వాడటం అనవసరం) వాసన ఉంటుందని నాకు మొదటిసారి తెలిసింది.

ఒక్కొక్క సిగ్గు పొరా నన్ను వీడి, మంచం పక్కన పడుతోంది.

పెళ్ళయ్యాక – ప్రతిరాత్రీ స్త్రీ భూదేవి అవ్వాలేమో అని భయపడేదాన్ని. రోమాన్స్ లో 'బరువూ' బాధ్యతలు కూడా ఆనందంగానే ఉంటాయని అర్థమయింది. బరువు సంగతి పక్కన పెట్టి 'భాగస్వామి'గా నా వంతు రొమాంటిక్ 'బాధ్యతలు' ప్రారంభించబోయే టైంకి జరిగిందది!

పెద్ద షాక్..!

ఏం జరిగిందీ గ్రహించేలోపులో నాకన్నా ముందే అతడు దాన్ని గ్రహించినట్టు వివర్ణమైన మొహాన్ని వంపుల్లో దాచుకున్నాడు. నా శరీరం వంపుల్లో కాదు. దిండు వంపుల్లో---!

...

ఇది జరిగి వారం రోజులైంది.

నా భర్త నపుంసకుడు కాదని నా మనస్సు గాఢంగా చెప్తోంది. అయినా ఇప్పుడు నా సమస్య అదికాదు. తాను కొత్తగా తెలుసుకున్న చేదునిజాన్ని జీర్ణించుకోవటానికి అతడికి కొంత సమయం ఇవ్వాలి. డిప్రెస్ కాకుండా చూడాలి. అదీ నా ప్రస్తుత బాధ్యత..!

అందుకే నేను సాధారణంగా ఉన్నట్టు కనపడటానికి ప్రయత్నించాను.

"ఇంతవరకూ నాకు ఏ స్త్రీతోనూ అనుభవం లేదు!" చెప్పాడతను. "...కానీ నాకు కరెక్టుగా తెలుసు. నాలో ఏ లోపమూ లేదు. ఎందుకో ఆ సమయంలో నిస్సత్తువో, నిరాసక్తతో ఏర్పడుతోంది. డాక్టర్ని కలవాలో, మానసిక నిపుణుడిని కలవాలో అర్థం కావటం లేదు."

"ఇప్పుడు తొందరేముందీ..? కొంతకాలం వేచి చూద్దాం. తరువాత దానంతట అదే సర్దుకుంటుంది!" అన్నాను మనస్ఫూర్తిగా... నిజాయితీగా.

ఎందుకో ఈ సమస్య తాత్కాలికమే అని తోచింది. ఒక రకంగా ఇది మా మధ్య బంధం గట్టిపడటానికి సహాయపడుతుందనిపించింది.

ఈలోపున ఆసిఫ్ తల్లి మమ్మల్ని 'హనీమూన్'(?) కి తొందరపెట్టింది.

...

పాకిస్తాన్ కి ఉత్తరం వైపున హిమాలయ పర్వతాల అంచులో 'స్కార్దూ ' అన్న ప్రాంతం ఉంది. పర్వత శిఖరాల మీద కరిగిన మంచు 'హూషే' నదిగా మారి దక్షిణానికి ప్రవహించి ఇండస్ లో కలుస్తుంది. పచ్చిక బయళ్ళు, దూరంగా తెల్లటి కొండలు, మధ్యలో నది, చుట్టూ తోటలూ... చాలా మనోహరంగా ఉంది ఆ దృశ్యం.

ఆసిఫ్ నా చేతిలో చేయి వేసి దగ్గరకి తీసుకుంటూ " ఇంత అద్భుతమైన ప్రదేశం ఈ ప్రపంచంలో ఇంకెక్కడా లేదు!" అన్నాడు.

నేను అతన్ని అల్లరి పట్టిస్తూ "మా గోదారి పక్కన ఇంతకన్నా వెయ్యి రెట్లు అందంగా ఉంటుంది!" అన్నాను.

ఆసిఫ్ మొహంలో రంగులు మారాయి. "వీల్లేదు, ఉండటానికి వీల్లేదు!" అన్నాడు.

నేను అతడి మొహంలోకి సూటిగా చూస్తూ, "మీరెలా చెప్పగలరు? మీరొక్క ప్రదేశమే చూశారు. రెండు ప్రదేశాలూ చూసింది నేను. కాబట్టి నా వాదమే కరెక్టు!" అన్నాను. అతడు దెబ్బతిన్నట్టు నావైపు చూసి కొద్దిసేపు ఏమీ మాట్లాడలేదు. అతడి తరఫు నుంచి వాదన ఏమీ లేదని నాకు తెలుసు.

కానీ ఓడిపోవటం ఇష్టం లేనట్టుగా అతడు కాస్త స్వరం హెచ్చించి "ప్రతిదీ చూసి అనుభవించి చెప్తేనే నిజమవుతుందా ఏమిటి?" అన్నాడు.

అది మూర్ఖవాదం అని నాకు తెల్సు. కానీ నేను దానిగురించి ఆలోచించటం లేదు. అతడి మొహం వైపే చూస్తున్నాను. అతడి మొహం జేగురురంగుకి మారిపోయి ఉంది.

ఇలాంటి మొహాన్నే నేను తరచూ మా ఇంట్లో చూస్తూ ఉండేదాన్ని. కాబట్టి నేను వెంటనే పోలిక పట్టుకోగలిగాను.

ఆ మొహం నా తండ్రిది!

దాదాపు యాభై సంవత్సరాల క్రితం కరాచీ నుంచి కట్టుబట్టలతో వచ్చేసినందుకు అతడికి తన మీదా, సమాజం మీదా కసి పెరిగింది. ప్రతిరోజూ విపరీతంగా తాగటం అలవాటయింది. ఆ విసుగూ, చిరాకూ ఎక్కువైతే అకారణంగా కోపం వచ్చేది. నా తల్లితో వాదన వేసుకునేవాడు. అందులో ఏ బలమూ లేకపోయినా మగవాడు కాబట్టే గెలిచేవాడు. నా తల్లి అతని చేతుల్లో తన్నులు కూడా తినేది. అలా కొడుతున్నప్పుడు నా తండ్రి మొహం కూడా ఇలాగే జేగురు రంగుకి మారటం నాకు గుర్తుంది.

నా భర్తతో అకారణమైన వాదాన్ని పొడిగించటం ఇష్టం లేక దూరంగా ఉన్న పర్వతాలని చూపిస్తూ, "అటువైపే కదా భారత దేశం?" అన్నాను.

"అవును. దాన్ని కార్గిల్ అంటారు. అతి తొందరలో అక్కడ యుద్ధం జరగబోతోంది!" అన్నాడు. సంభాషణ మార్చటంలో ఆవిధంగా సఫలీకృతురాలిని అయినందుకు సంతోషం వేసింది.

అతి కొద్దికాలం లోనే అతడి మాట నిజమైంది. భారత ప్రధాని వాజ్‌పేయి వచ్చి వెళ్ళిపోయిన కొన్ని నెలలకి యుద్ధం ప్రారంభమయింది. ఎక్కువ కాలం జరగలేదు కానీ, ఆసిఫ్ కి మాత్రం తట్టుకోలేనంత పెద్ద దెబ్బ తగిలింది. అతడి ప్రాణమిత్రుడూ, మరో సైనికాధికారీ అయిన ఇక్బాల్ ఆ పోరటంలో మరణించాడు. యుద్ధానికి వెళ్ళడానికి ముందురోజే 'ఇక్బాల్' మా ఇంట్లో 'దావత్'కి వచ్చాడు. ఇద్దరూ కలిసే బయల్దేరారు. అతడి మరణం తో నా భర్త కసితోనూ, ఉక్రోషంతోనూ ఉడికిపోవటం గమనించాను. దీనికి మరొక కారణం కూడా ఉంది. అతడి మిత్రుడు ఇక్బాల్ యుద్ధంలో మరణించినప్పుడు ఆ శవాన్ని 'తమది' గా గుర్తించటానికి పాకిస్తాన్ నిరాకరించింది. దాన్నొక అనాథ కాశ్మీరీ మిలిటెంట్ శవంగా గుర్తించి, భారత సైనికులే పాతి పెట్టారు.

ఈ యుద్ధానికి కారణం పాకిస్తాన్ సర్వ సైనికాధికారి ముషరాఫ్..! కార్గిల్ పై అతడు చేసిన దురాక్రమణ గురించి ఆ దేశప్రధాని అయిన నవాబ్ షరీఫ్ కి కూడా తెలియదని అప్పట్లో కొన్ని పత్రికలు వ్రాశాయి. తెలిస్తే యుద్ధానికి వప్పుకునే వాడు కాదట. తెలియగానే యుద్ధం ఆపి, (అప్పటికే భారతసైన్యం చేతిలో చావు దెబ్బ తిన్న) సైన్యాన్ని వెనక్కి పిలిపించాడట.

అందుకే నా భర్తకి ప్రధాని నవాజ్ అంటే చాలా గౌరవం. ముషరాఫ్ అంటే కోపం.

...నా భర్త ఆరోగ్యంలో మార్పు లేదు. అయితే చాలామంది భార్యాభర్తల కంటే మేము సుఖంగా ఉన్నామని చెప్పుకోవాలి. కారణం మా ఇద్దరి మధ్యా ఉన్న కమ్యూనికేషన్. ఏదన్నా వితండవాదం చేయవలసి వచ్చినప్పుడు తప్ప మిగతా పరిస్థితుల్లో ఆసిఫ్ లాంటి వ్యక్తి భర్తగా లభించటం అదృష్టం. నా తండ్రి లాంటి చాలామంది భర్తల్లా కాకుండా, అతడు నాతో ప్రవర్తించే విధానం బావుంటుంది.

ఇలా కొన్ని రోజులు గడిచాయి.

తన ఆరోగ్యంలో ఏ మార్పూ రాకపోవటంతో ఎవరన్నా సైకియాట్రిస్టిని కలుసుకోవాలన్న నిశ్చయానికి వచ్చాడు నా భర్త. అతడింత కాలం ఆగటానికి కారణం నేనే. నాకెందుకో ఇంకా నమ్మకం సడలిపోలేదు. అతడిలో పురుషపరమైన మార్పుని భార్యగా నేను గుర్తించగలుగుతున్నాను కానీ, ఎక్కడో ఏదో మెలిక ఉంది. అదే తెలియటం లేదు. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూ ఉండగా–

ఒక రోజు పన్నెండు గంటలకి మా ఇంట్లో ఫోన్ మోగింది.

ఆసిఫ్ హడావుడిగా వెళ్ళిపోయాడు. నాలుగురోజుల పాటు ఇంటికి రాలేదు. అప్పుడే విస్ఫోటనం లాంటి వార్త తెలిసింది. పాకిస్తాన్ ప్రధాని నవాజ్ షరీఫ్ ని సైన్యం బంధించింది..!

నాలుగు రోజుల తరువాత ఇంటికి వచ్చిన ఆసిఫ్ చాలా చిరాగ్గా ఉండటం గమనించాను.

"ఏమైంది?" అడిగాను.

"ప్రధాని నవాజ్ ని మా సైనికాధికారి ముషరాఫ్ జైల్లో పెట్టాడు!"

"అవును. పేపర్లన్నీ అదే వార్త కదా. ఇంతకీ ఈ నాలుగు రోజులూ మీరు ఎక్కడున్నారు?"

"తిరుగుబాటు జరక్కుండా, అతడి జైలు ముందు సెక్యూరిటి బాధ్యత నాకు అప్పగించారు."

"ఎవరు?"

అతడు నా వైపు విసుగ్గా చూసి, "ఇంకెవరు? ముషరాఫ్" అన్నాడు.

"మీరు ఎవరి కింద పని చేస్తున్నారు.? ప్రధాని నవాజ్ షరీఫ్ కిందా? సైనికాధికారి ముషరాఫ్ కిందా?" అడిగాను.

ఆసిఫ్ మొహం క్రమక్రమంగా జేగురురంగుకి మారసాగింది. అతడిలో వస్తున్న ఈ పరిణామాన్ని గుర్తించినా నేను బెదరలేదు. నేను చెప్పదలుచుకున్నది అతడికి చెప్పటమే ఆ క్షణం నా ఆశయం. అందుకే కొనసాగించాను. "ఏదైనా ఒక ప్రాంతాన్ని గానీ, వర్గాన్ని గానీ – మరో బలవంతమైన దేశం అణగదొక్కితే పక్కదేశమో, మరో సానుభూతి దేశమో ఆ వర్గానికి సాయపడటం న్యాయం. బంగ్లా విషయంలో భారతదేశం అదే చేసింది. కానీ, కాశ్మీర్లో ప్రజలేమీ కష్టనష్టాలతో తల్లడిల్లిపోవటం లేదే! భారతదేశ ప్రజల్లాగే వారు కూడా సంపూర్ణ స్వాతంత్రంతో బ్రతుకుతున్నారు. వారిని రక్షించవలసిన ఖర్మ మనకేం లేదు!"

"కానీ, కాశ్మీర్ ఒక ముస్లిం దేశం!" అరిచాడు.

నేను కూడా అంతే ఆవేశంగా "పాకిస్తాన్లో ఉన్న మొత్తం ముస్లిముల సంఖ్య కన్నా భారతదేశంలో ఉన్న ముస్లిముల సంఖ్య ఎక్కువ!" అన్నాను.

అతడు తన స్వరం మరింత గట్టిగా పెంచి, "జిహేద్ అంటే ఏమిటో తెలుసా నీకూ? పోరాటం!" అన్నాడు.

నేను కూడా అంత గట్టిగానే "దాని గురించి నాకు తెలుసు. అల్లా ఎప్పుడూ ఆ పోరాటాన్ని మీరు చెపుతున్న పోరాటానికి అన్వయించ లేదు. ఆ విషయం మీకూ తెలుసు. మీలో ఉన్నఒక గొప్ప సుగుణం ఏమిటో తెలుసా? మీకు వాదించటం చేతకానప్పుడల్లా అధికారాన్ని చూపిస్తారు. దాన్ని మానుకోండి!" అన్నాను.

అతడు నిరత్తుడై అయోమయంగా నావైపు చూసి, ఏమీ మాట్లాడలేనట్టుగా మౌనంగా ఉండి పోయాడు. నేను కొనసాగించాను – "ఆ రోజు చెప్పాను గుర్తుందా? గోదావరి ఒడ్డునీ చూశాను, ఇండస్ నదినీ చూశాను. కాబట్టి మీకన్నా నేను ఎక్కువ నమ్మకంగా చెప్పగలను. మన దేశంలో డెబ్బై అయిదు శాతం పైగా జనం కూలీలుగా బతుకుతున్నారు. తినడానికి సరిగ్గా తిండి లేదు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాం. ఆ చేదు సత్యం నుంచి

ప్రజల్ని దూరంగా ఉంచటానికి  మన సైన్యం, మన ప్రభుత్వం మతాన్నీ, యుద్ధాన్ని ఎరగా చూపుతోంది. పన్నెండు లక్షల భారత సైన్యంతో ఆరులక్షలు కూడా లేని పాకిస్తానీ సైన్యం పోరాడి గెలవలేదని మీకు కూడా తెలుసు. అందుకే మీకు అసంతృప్తి. ఒక్కసారి మీరూ ఆలోచించండి!"

నా భర్త తెల్లబోయి నాకేసి చూశాడు.

"ఒక సైనికాధికారి మిమ్మల్ని యుద్ధానికి పంపించాడు. మరో ప్రధాని మిమ్మల్ని యుద్ధం నుంచి వెనక్కి పిలిపించాడు. ఈలోపులో మీరు మీ మిత్రుణ్ణి కోల్పోయారు. యుద్ధక్షేత్రంలో మీ మిత్రుడి శవం తమది కాదన్నందుకు ముషరాఫ్ ని తిట్టారు. అదే ముషరాఫ్ మళ్ళీ ఇప్పుడు ప్రధానిని గృహబంధం చేయమని ఆజ్ఞాపిస్తే, ఆ వృత్తి నిర్వర్తించారు. మీకు పని చెప్పేదెవరు? మీరు పని చేసేది ఎవరి కోసం? ఇంతకీ మీ పై అధికారి ఎవరు?" అని ప్రశ్నించాను.

అతడు చాలా సేపు మవునంగా ఉంది, ఆ పై నా దగ్గరగా వచ్చి కళ్ళలోకి చూస్తూ, "నువ్వు చెప్పింది నిజమే అనిపిస్తోంది!" అన్నాడు.

...

ఆ రాత్రి అతడు నన్ను దగ్గరికి తీసుకున్నాడు. అతడిలో నాకు కొత్త ఆసిఫ్ కనిపించాడు. హృదయంలోంచి ఉబికి వచ్చే సంతృప్తికి చర్మం మీద నిలబడే చెమట బిందువులే తార్కాణమైతే నా శరీరం అతడి తాకిడికి చెమట ముద్దగా మారింది. ఆనకట్ట తెగిన నది క్షణాల్లో ఎలా ఉధృతమవుతుందో ఆ విధంగా కోరిక కట్టలు తెంచుకుని ప్రవహించింది. నా భర్త సంపూర్ణ మానవుడయ్యాడు.

పది నిముషాల తర్వాత ఇద్దరం వెల్లకిలా పడుకుని ఉన్నాం. తలకింద చేతులు పెట్టుకుని అతడు సంతృప్తిగా కళ్ళు మూసుకుని ఉన్నాడు.

పై కప్పుకేసి చూస్తూ నేనన్నాను. "మొట్ట మొదటి రోజు మీరు నన్నో ప్రశ్న అడిగారు గుర్తుందా? సరసం అంటే ఏమిటని. ఆ తరువాత నేను నిఘంటువు వెతికాను. 'రసము ' అంటే అనురాగము. సరసము అంటే సామీప్యము. అయితే ఇది కేవలం శృంగారానికి సంబంధించినది కాదు. మనిషికి సంబంధించినది. తనపట్ల తనకి అనురాగం లేనివాడు, తన భావాల పట్ల తనకి నమ్మకం లేనివాడు, తను ఎవరికోసమైతే పని చేస్తున్నాడో ఆ మనిషి మీద గౌరవమూ, అభిమానమూ లేనివాడు, సరసానికి పనికి రాడు! 'నాకీ రోజు మూడ్ లేదు ' అని ఒక్కోసారి మనం అనుకుంటూ ఉంటాం. ఏదో సంఘటన జరగటం వలన మనకా రోజు మూడ్ పోతుంది. పర్వాలేదు. ఎందుకంటే... అది తాత్కాలిక అసంతృప్తి! అదే జీ..వి..తం పట్ల అసంతృప్తి అనుకోండి. అప్పుడేమవుతుంది? శాశ్వతంగా మూడ్ పోతుంది..! మానసిక నపుంసకత్వం వస్తుంది..! ఒక శత్రు సైనికుడిని చంపటం, అదే దేశ ప్రధానికి సెక్యురిటి ఇవ్వటం... అదే అకారణ అసంతృప్తి. అందుకే భారత ప్రధానికి సెక్యూరిటీ ఇవ్వవలసి వస్తుందని తెలియగానే మీరు మన తొలిరాత్రి శృంగారంలో నిర్వీర్యులయ్యారు. తనలోకి తను ప్రవహించ లేనివాడు, తనని తాను రమించుకోలేనివాడు ఇతరులనెలా రమిస్తాడు? ఇతరుల్లోకి ఎలా ప్రవహిస్తాడు? సరసం అంటే కేవలం ఇతరులలోకి ప్రవహించటం మాత్రమే కాదు. తనలోకి తాను ప్రవహిస్తూ ఆ సంతృప్తిని అవతలివారికి అర్థమయ్యేలా చెప్పటం!"

వెల్లకిల పడుకుని ఉన్నవాడల్లా నెమ్మదిగా నా వైపు తిరిగి సజలనేత్రాలతో కొంచెం సేపు నా మొహం వైపు చూసి, వంగి నా అధరాలపై చుంబించాడు.

ఇక జీవితంలో మరెప్పుడూ అతడి మొహం జేగురు రంగులోకి మారదని నాకెందుకో అపారమైన నమ్మకం కలిగింది.

.

★★★

# (వచ్చే నెల మరో కథతో కలుసుకుందాం)